


# యువతి,యువకుడిని బెదిరించిన ముగ్గురు పోలీసుల సస్పెండ్

**ప్రజానావ, ముంబై:** ఐటీ రంగానికి చెందినయువతి, యువకుడిపై తప్పుడు కేసు బనాయించి, ఉద్యోగం పోగొడతామని బెదిరించి డబ్బులు వసూలు చేసిన వాఘోలి పోలీస్ స్టేషన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులను పోలీస్ కమిషనర్ అమితేష్ కుమార్ సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేయబడిన వారి పేర్లు: పోలీస్ కానిస్టేబుల్ కిరణ్ అబ్దాగిరే, పోలీస్ కానిస్టేబుల్ గణేష్ ఖడే, కిరణ్ కాంబ్లే. ఏప్రిల్ 2వ తేదీ రాత్రి వాఘోలిలోని ఒక సొసైటీకి కొంతమంది యువతులను తీసుకువచ్చి వీడియో తీస్తున్నారని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు, బిట్ మార్షల్స్‌గా గస్తీ కాస్తున్న గణేష్ ఖడే, కిరణ్ కాంబ్లే అక్కడికి చేరుకున్నారు. వారు అక్కడ ఒక యువకుడిని, ఒక యువతిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. కానిస్టేబుల్ కిరణ్ అబ్దగిరే, 'మీపై సెక్స్ రాకెట్ కేసు పెడతాం, మీ ఉద్యోగం పోయేలా చేస్తాం, మీ బంధువులను పిలుస్తాం' అని భయపెట్టారు. పోలీస్ కానిస్టేబుల్ గణేష్ ఖడే ఆ యువకుడిని చెంపదెబ్బ కొట్టి తీవ్ర భయాందోళనలకు గురిచేశారు. దీనితో పాటు, ఆ యువతిని పోలీస్ స్టేషన్‌లో నిలబెట్టి మానసిక ఒత్తిడికి గురిచేశారు. ఈ విషయాన్ని పరిష్కరించడానికి పోలీసులు ఆ యువకుడి నుంచి డబ్బు డిమాండ్ చేశారు. చివరకు, అతను ఒక గ్యారేజీకి చెందిన 'ఫోన్ పే' క్యూఆర్ కోడ్ చూపించి రూ. 10,000 బలవంతంగా వసూలు చేశారు. అయితే, పోలీసుల అనుమానాస్పద కార్యకలాపాల కారణంగా, ఆ యువకుడు ఈ విషయంపై విచారణ జరపడంతో అసలు నిజం బయటపడింది. ఇదంతా డబ్బు వసూలు చేసే ఉద్దేశ్యంతోనే జరిగిందని వెల్లడైంది. ఈ విషయం పోలీస్ కమిషనర్ అమితేష్ కుమార్ దృష్టికి రాగానే, ఆయన ఈ విషయంపై ప్రాథమిక విచారణకు ఆదేశించారు. విచారణలో నిజం బయటపడటంతో, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సోమయ్ ముండే ఆ ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్య పోలీసులలో పెద్ద ప్రకంపనలు సృష్టించింది.

# 14 ఏళ్ల భార్య, 19 ఏళ్ల భర్త

**పెళ్లయిన కేవలం 4 నెలలకే బాలిక ఆత్మహత్యకు పాల్పడింది.**



**ప్రజానావ, ముంబై :** సోలాపూర్ జిల్లాలోని మంగళ్‌వేడ తాలూకాలో దిగ్భ్రాంతికరమైన సంఘటన చోటుచేసుకుంది. తాలూకాలోని బావ్‌చి, నింబాని ప్రాంతాల్లో 14 ఏళ్ల బాలికకు బాల్య వివాహం జరిపించారు. దిగ్భ్రాంతికరంగా, పెళ్లయిన కేవలం 4 నెలలకే ఆ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళ్‌వేడ ప్రాంతమంతటా తీవ్ర కలకలం రేపింది. బాల్య వివాహాల సమస్య మరోసారి తెరపైకి వచ్చింది.

### విషయం ఏమిటి?

ఈ సంఘటన వివరాలు ఏమంటే, సదరు బాలికకు కేవలం 13 సంవత్సరాల 9 నెలల వయస్సులో వివాహం జరిగింది. వివాహం తర్వాత, ఆమె జీవితం మరో 4 నెలల పాటు కొనసాగింది. అయితే, ఈ కాలంలో ఆ మైనర్ బాలిక తన భర్త, అత్తమామల చేత తీవ్రమైన మానసిక, శారీరక హింసకు గురైంది. అత్తమామల నిరంతర వేధింపులతో విసిగిపోయిన ఆ బాలిక, చివరికి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య చేసుకునే సమయానికి ఆ బాలిక వయస్సు కేవలం 14 సంవత్సరాల 2 నెలలు మాత్రమే. ఈ కేసులో, ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు గాను, ఆ బాలిక భర్త, అత్తమామలు, ఇతర బంధువులపై మంగళ్‌వేడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. ముఖ్యంగా, ఆ బాలికను వివాహం చేసు కున్న అబ్బాయి వయస్సు కూడా కేవలం 19 సంవత్సరాలే. విషయం యొక్క తీవ్రతను గుర్తించిన మంగళ్‌వేడ పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రయ బోరిగిద్దే మార్గదర్శకత్వంలో, పోలీసులు మృతురాలి భర్తను, మామను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఇద్దరు నిందితులను ఏప్రిల్ 10 వరకు పోలీసు కస్టడీకి అప్పగించింది. ఈ బాల్య వివాహానికి కచ్చితంగా ఎవరు మధ్యవర్తిత్వం వహించారు, దానిని ఏర్పాటు చేయడంలో ఎవరు చురుకుగా ఉన్నారు. ఇంత చిన్న వయస్సులో వివాహం ఎందుకు ఏర్పాటు చేయబడింది అనే విషయాలను తెలుసుకోవడానికి పోలీసులు ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. అయితే, ఈ బాల్య వివాహం జరిగిన కేవలం 4 నెలల తర్వాత బాలిక ఆత్మహత్య చేసుకోవడం ఆ ప్రాంతంలో కలకలం రేపుతోంది.

# హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

**ప్రజానావ, ముంబై:** కేవలం 50రూపాయల అప్పు విషయంలో తలెత్తిన వివాదం దారుణ హత్యకు దారితీసింది. ఈ కేసులో హింగన్‌ఘాట్ జిల్లా, సెషన్స్ కోర్టు కీలక తీర్పునిస్తూ, నిందితునికు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధించింది. డబ్బు విషయంలో తలెత్తిన వివాదం కారణంగా ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. మృతుడు నిందితుడి భార్య వద్ద 50 రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. ఈ చిన్న మొత్తాన్ని తిరిగి చెల్లించే విషయంలో నిందితుడికి, మృతుడికి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ వాగ్వాదం కాస్తా మాటల యుద్ధానికి, కొట్లాటకు దారితీసింది. తీవ్ర ఆగ్రహానికి గురైన నిందితుడు, దగ్గరలో ఉన్న ఒక చెక్క దూలాన్ని తీసుకుని మృతుడి తలపై బలంగా కొట్టాడు. ఆ దెబ్బ ఎంత బలంగా తగిలిందంటే, ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. కేసు నమోదు చేసి,దర్యాప్తు పూర్తయిన తర్వాత, హింగన్‌ఘాట్ జిల్లా, సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వ వకీలు సమర్పించిన సాక్ష్యాధారాలను, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను అంగీకరించిన కోర్టు, నిందితుడిని దోషిగా నిర్ధారించింది. యావజ్జీవ కారాగార శిక్ష.రూ. 5,000 జరిమానా విధిస్తూ కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది.

# రైతుల వద్దకే విద్యుత్ అధికారులు

- "రైతు పొలం బాట" కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారం
- ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్ నేతృత్వంలో పాపయ్యపల్లి గ్రామంలో విజయవంతంగా నిర్వహణ



**ప్రజానావ, సిరిసిల్ల:** రైతులకు మరింత చేరువై వారి విద్యుత్ సమస్యలను నేరుగా క్షేత్రస్థాయిలో అర్థం చేసుకుని తక్షణ పరిష్కారం అందించేందుకు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) చేపట్టిన "రైతు పొలం బాట" కార్యక్రమం అత్యంత ప్రభావవంతంగా నిర్వహించబడుతోందని ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్ స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్ళపల్లి సెక్షన్ పరిధిలో పాపయ్యపల్లి గ్రామంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) బి. బిక్షపతి తో కలిసి చీఫ్ ఇంజనీర్ అశోక్ స్వయంగా పొలాల వద్దకు వెళ్లి రైతులతో ముఖాముఖి సంభాషించారు. ఉన్నతాధికారులు స్వయంగా పొలాల వద్దకు రావడం చూసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ - తక్షణ సేవలు

కార్యక్రమంలో భాగంగా పాపయ్యపల్లి గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణను సిబ్బంది అక్కడికక్కడే చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, నిర్వహణ పనులను తక్షణమే నిర్వహించారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందేలా చూడడమే లక్ష్యంగా సిబ్బంది కృషి చేశారు.

### భద్రత, అవగాహన - రైతులకు మార్గదర్శనం

ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన చీఫ్ ఇంజనీర్ అశోక్, వ్యవసాయ విద్యుత్ సరఫరా, భద్రతా చర్యలు, విద్యుత్ వినియోగంపై రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. వ్యవసాయ పనుల సమయంలో విద్యుత్ ప్రమాదాల నుండి తమను తాము ఎలా కాపాడుకోవాలో ఆచరణాత్మక సూచనలు అందించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన ప్రమాదకర పరిస్థితులైన "లూజ్ లైన్లు" వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తక్షణమే సరిదిద్దడం, వంగినవిద్యుత్ స్థంభాలను సరి చేయడం, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుపెంచడం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే సరిచేస్తున్నామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ పనులు ఏ మాత్రం జాప్యం లేకుండా యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### స్వయంగా విద్యుత్ పనులు చేయవద్దు

ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు స్వయంగా విద్యుత్ కనెక్షన్లు మార్చడం, వైర్లు సరిచేయడం లేదా ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోవడం చేయకూడదని చీఫ్ ఇంజనీర్ విజ్ఞప్తి చేశారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని, లేదా ఎన్పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు వెంటనే కాల్ చేయాలని కోరారు. అజాగ్రత్తగా వ్యవహరించడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు.

### రైతులకు చేరువగా ఎన్పీడీసీఎల్, ముందుకు సాగే నిబద్ధత

విద్యుత్ సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా, నిరంతరాయంగా, నాణ్యంగా అందించడం తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని చీఫ్ ఇంజనీర్ శ్రీ అశోక్ స్పష్టం చేశారు. "రైతు పొలం బాట" వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా అన్నదాతలకు మరింత చేరువై, వారి సమస్యలను అర్థం చేసుకుని, తక్షణ పరిష్కారం అందిస్తూ ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహిస్తామని, ఒక్క రైతు సమస్య కూడా పరిష్కారానికి నోచుకోకుండా ఉండదని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డివిజనల్ ఇంజనీర్ ఎన్ . అంజయ్య, ఏడి ఈ గోపినాథ్, అసిస్టెంట్ ఇంజనీర్ మధుకర్, జూనియర్ ఇంజనీర్లు, లైన్‌మెన్‌లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఇసుక సరఫరాలో కొత్తగా ' ఆన్ లైన్ ' విధానంతో ట్రాక్టర్ యజమానుల నడ్డి విరిచే ప్రయత్నాలు

- జిల్లాలో పదివేల కుటుంబాలపై ఉపాధి పై దెబ్బ
- పాత వే బిల్లులు, కూపన్ల విధానంతోనే అనుమతించాలి
- లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా సరఫరా నిలిపివేసి ఆందోళన ఉధృతం చేస్తాం
- ట్రాక్టర్ యజమానుల సమావేశంలో నేతల వెల్లడి



**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్రం రాక ముందు "మా ఊరు మా ఇసుక" స్లోగన్లు ఇస్తూ, ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వాలు ప్రస్తుతం ట్రాక్టర్ యజమానుల నడ్డి విరిచే పరిస్థితి తెచ్చాయని సిరిసిల్ల పట్టణం ట్రాక్టర్ యజమానుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం సిరిసిల్ల సాయినగర్ లోని శ్రీ సాయిబాబా ఆలయం వద్ద పట్టణ ట్రాక్టర్ యజమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యజమానుల సంఘం నాయకులు రాపల్లి రమేష్ మాట్లాడుతూ ఇసుక సరఫరా లో కొత్తగా ఆన్ లైన్ విధానం వల్ల నష్టపోయే పరిస్థితి ఉన్నదని, గతంలో మాదిరిగానే పాత పద్ధతిలో ఆఫ్ లైన్ లో కూపన్ల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఇసుక సరఫరా వ్యవస్థపై జిల్లాలో పదివేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, ఆన్ లైన్ విధానం కొత్తగా ప్రవేశపెట్టి ట్రాక్టర్ యజమానుల ఉపాధిని గండికోట వద్దని కోరారు. తిరిగి ఆఫ్ లైన్ ద్వారా ఇసుక సరఫరా చేయడానికి అనుమతించాలని, లేని పక్షంలో జిల్లాలోని 26 మండలాల ఇసుక సరఫరా ట్రాక్టర్ యజమానులు ఉధృతమైన పోరాటం సాగిస్తారని హెచ్చరించారు. తాము ఏ ప్రభుత్వాలను విమర్శించడం లేదని, అన్ని ప్రభుత్వాలకు అనుకూలంగానే సాగుతున్నామన్నారు. గతంలో ఇసుక ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.60, క్రమంగా 100, 180, 500 రూపాయల వరకు వే బిల్లు చార్జీలు పెంచిన ప్రభుత్వానికి డిమాండ్ డ్రాఫ్టులు చెల్లించామని, క్రమంగా ఎంత చార్జీలు పెంచినా డీడీలు చెల్లిస్తూ ఇసుక సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వే బిల్లులు, కూపన్లు, ఆఫ్ లైన్ విధానానికి స్వస్తి పలికారని పేర్కొన్నారు. దీని వల్ల చాలా కుటుంబాలు నష్టపోతున్నాయన్నారు. ఆన్ లైన్ విధానంలో చదువుకున్న వారు, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారే కావాలని కానీ ఇసుక ట్రాక్టర్లు నడిపే యజమానుల కుటుంబాలలో చదువుకున్న వారు తక్కువ అన్నారు. ఇంటి అనుమతులు ఉంటేనే ఇసుక సరఫరా చేసే అనుమతి ఉందని, పురాతన ఇండ్లకు, మరమ్మత్తులకు కొత్తగా ఎలాంటి అనుమతులు తీసుకునే అవకాశం లేదన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఆన్ లైన్ పరిజ్ఞానం లేకుంటే ఇసుక ఎలా సరఫరా చేయాలో అధికారులే సూచించాలన్నారు. ఇప్పటికే ఆర్ టి ఏ డ్రైవింగ్ లైసెన్సుల విధానాల వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, డ్రైవింగ్ చేసేవారు పదవ తరగతి పాస్ అయి ఉండాలని అంటున్నారని, డ్రైవర్ల వ్యవస్థలో ఇలా చదువుకున్న వారు తక్కువ అని, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా ఇసుక సరఫరా చేసే అవకాశం లేదన్నారు. చిన్న చిన్న ఇండ్లు, పాత ఇండ్లు, గోడలు కూలిపోయే నివాసాలకు మరమ్మత్తులు చేపట్టాలన్న, నిర్మాణాలు చేయాలన్న కొత్తగా పర్మిషన్లు తీసుకురాలేరన్నారు. పాత, పురాతన ఇళ్లకు 50 శాతం ఇళ్ల అనుమతులే లేవన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్య నగర్, బీవై నగర్ తదితర కార్మిక వాడల్లో ఇంటి నిర్మాణాలకు, ప్రభుత్వ గృహ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. మరి ఇలాంటి వారు ఇల్లు కట్టుకోవద్దా? మరమ్మత్తులు చేసుకోవద్దా? అని ప్రశ్నించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని అన్నారని, మళ్ళీ డీడీలు చెల్లించాలని చెబుతున్నారని ఆరోపించారు. పేదల కోసం ప్రభుత్వం అన్నారు కానీ ఆచరణలో అది శూన్యం అన్నారు. ఇలా కొత్త నిబంధనలతో ఆన్ లైన్ విధానాలు అమలు చేస్తే వ్యవస్థ ఎలా కొనసాగుతుందన్నారు. వెంటనే ఆన్ లైన్ విధానానికి స్వస్తి పలికి ఆఫ్ లైన్ విధానం తిరిగి ప్రవేశపెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించి, తమ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆఫ్ లైన్, కూపన్ల పద్ధతి తిరిగి కొనసాగించాలని, ఆన్ లైన్ పద్ధతికి స్వస్తి చెప్పాలని, లేనిపక్షంలో ప్రభుత్వం ఇలాగే తమ ఉపాధిని కోల్పోయే పరిస్థితి కొనసాగిస్తే జిల్లావ్యాప్తంగా ఇసుక సరఫరా నిలిపివేసి పోరాటం సాగిస్తామని ప్రకటించారు.

# గోదావరి జలాలతో రైతుల ఆశలు నెరవేర్చిన ఎమ్మెల్యే

### నీళ్లు వచ్చిన రోజు పండగ... ఆ రోజు తీసుకొచ్చిన నేత ఆది శ్రీనివాస్



**ప్రజానావ, వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని ఎదురుగట్ల గ్రామ చెరువులో గోదావరి జలాలు చేరడంతో గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. చెరువు నిండుగా నీటితో కళకళలాడుతుండగా, గంగమ్మ తల్లికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఘనంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎదురుగట్ల చెరువుకు గోదావరి జలాలు చేరడం వెనుక ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతర శ్రమ, దూరదృష్టి ఉందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న చిత్తశుద్ధి వల్లే ఈ రోజు చెరువు నిండుగా నీటితో కళకళలాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో. మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.సోయినేనీ కరుణాకర్. గ్రామ సర్పంచ్ కడారి తిరుపతి సంధ్య.అడిక శ్రీనివాసరెడ్డి జైపాల్ రెడ్డి పొన్నం మల్లేశం నేదూరీ నరసయ్య పాలకుర్తి శంకరయ్య రోమాల ప్రవీణ్ వంగపల్లి మల్లేశం గంగారెడ్డి భూమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ప్రకాష్ రామస్వామి బాలయ్య కిషన్ నాగేందర్ నాగరాజు కొమురయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్లు.రైతులు పాల్గొన్నారు

